'మృత్యు' దారులు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు-వరదల కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిని, ప్రమాదకరంగా, 'మృత్యు' దారులుగా మారాయి. ఆసుపాక-నారాయణపురం రోడ్డుపై ఎనిమిది అడుగుల లోతైన గుంత పడింది. అనంతారం-పండువారిగూడెం మార్గంలో డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గర పెదవాగు ప్రవాహ ఉధృతికి రోడ్డు పక్కన సుమారు ఐదు అడుగుల

పాల్వంచ రూరల్: దెబ్బతిన్న మందెరికలపాడు రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సుందరయ్యనగర్, మేదరబస్తీ ఏరియాల్లో పర్యటించి గ్రామస్తుల సమస్యలు వింటున్న రేగా

మణుగూరు టౌన్: బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం, కలెక్టర్ జితేష్

చంద్రుగొండ: వరి పొలాల్లో వరద నీరు

అశ్వారావుపేట టౌన్: అలుగు పారుతున్న వెంకమ్మ చెరువు

టేకులపల్లి: కొట్టుకుపోయిన రోడ్డు

చర్ల : కొత్తగూడెం వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ఆళ్లపల్లి: రోడ్డుపైకి చేరిన వరద నీరు

అశ్వారావుపేట రూరల్: ఆసుపాక-నారాయణపురం రోడ్డుపై గుంత

సారపాక: చింతలచెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్

చంద్రుగొండ: దెబ్బతిన్న రోడ్డు

అశ్వారావుపేట రూరల్: అనంతారంలో కొట్టుకుపోయిన సైడ్ బర్మ్

లోతున 150 అడుగులకు వరకు సైడ్ బర్మ్ కొట్టుకుపోయింది. గుమ్మడవల్లి-రంగాపురం మార్గంలో పెదవాగు బ్రిడ్జి దగ్గర గుంత పడింది. నారాయణపురం-బచ్చువారిగూడెం గ్రామాల మధ్యన అర కిలోమీటరుకు పైగా రహదారి కొట్టుకుపోయింది. ఈ రోడ్లపై రాత్రి పూట ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా/ప్రాణాంతకంగా ఉంది.

టేకులపల్లి మండలంలో..

టేకులపల్లి, సెప్టెంబర్ 2: మండలంలో కొన్నిచోట్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. సంపత్‌నగర్ శ్మశాన వాటిక దగ్గర కొత్తగూడెం-ఆళ్లపల్లి ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. ఈ మార్గంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడెం నుంచి సంపత్ నగర్ మీదుగా ఆళ్లపల్లి వరకు రోజూ ఆరుసార్లు తిరిగే ఆర్టీసీ బస్సును అధికారులు నిలిపివేశారు. అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 2: మండలంలోని చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అశ్వారావుపేట సమీపంలోని వెంకమ్మ చెరువు నుంచి వరద నీరు భారీగా దిగువకు ప్రవహిస్తున్నది. వాగొడ్డుగూడెం గ్రామ సమీపంలోని వాగు లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తున్నది. ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అశ్వారావుపేటలోని దొంతికుంట చెరువులో గుర్రపుడెక్క, ముళ్ళపొదలు ఉండడంతో పైనుంచి వస్తున్న వరద నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్తున్నది. దీంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చెరువులకు అలుగులు, కాలువలకు గండ్లు..

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 2: మండలంలోని చెరువులు అలుగులు పారుతున్నాయి. కాలువలకు గండ్లు పడుతున్నాయి. పొలాలు నీట మునుగుతున్నాయి. మందెరికలపాడు వద్ద రాళ్ళవాగు, చంద్రాలగూడెం వద్ద ఎర్రసాని చెరువు అలుగు పారుతున్నాయి. యానంబైలులో కిన్నెరసాని ఎడమ కాలువకు, బంగ్రిగొండలో సీతారామ కాలువకు గండ్లు పడ్డాయి. దీంతో సమీపంలోని వ్యవసాయ భూములు మునిగాయి.

310 ఎకరాల్లో పంట నష్టం

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు-వరదలతో మండలంలోని 310 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారి శంభోశంకర్ తెలిపారు. యానంబైలు, కిన్నెరసాని, సంగం, నారాయణరావుపేట, దంతెలబోర, బంగ్రిగొండ తదితర ప్రాంతాల్లో నీట మునిగిన, దెబ్బతిన్న పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. 250 ఎకరాల్లోని పత్తి, 50 ఎకరాల్లోని వరి, 10 ఎకరాల్లోని మిర్చి నష్టపోయినట్లు వివరించారు.

హమ్మయ్య.. తగ్గింది

అశ్వారావుపేట, సెప్టెంబర్ 2: నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజులపాటు వణికించిన వర్షం సోమవారం తెరిపిచ్చింది. సాయంత్రం 5.00 గంటల సమయంలో కొద్దిసేపు చిరు జల్లులు పడ్డాయి. లోతట్టు ప్రాంత ప్రజలు వరద ముంపు నుంచి తేరుకుంటున్నారు. ఈ వర్షాలతో వేరుశనగ పంట దెబ్బతిన్నది. వర్షాలు ఆగకపోతే పత్తి విత్తనాలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్యే పరిశీలన

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 2: మండలంలో వరద బాధిత ప్రాంతాలైన మందెరికలపాడు, మల్లారం, కిన్నెరసాని, రాళ్ళవాగు, యానంబైలును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం పరిశీలించారు. మందెరికలపాడు రోడ్డుకు పడిన గండిని చూశారు. వెంటనే మరమ్మతు చేయించాలని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులతో చెప్పారు.

వరద బాధితులకు పరామర్శ

చంద్రుగొండ, సెప్టెంబర్ 2: చంద్రుగొండలోని వరద బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం పరామర్శించారు. డబుల్ ఇండ్ల కాలనీకి డ్రైనేజీ, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు మంజూరు చేయాలని ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 2: రెండు రోజులుగా మండలంలో అకాల వర్షాలకు రోడ్లు, బ్రిడ్జిలు దెబ్బతినగా కొన్ని ఇళ్లు కూలిపోయాయి. పత్తి, మొక్కజొన్న, వరి పోలాలు ఇతర పంటలు నష్టం వాటిల్లింది. మండలంలోని కిన్నెరసాని, జల్లేరు, కోడెలవాగు, దునికిదోన్నె వాగులు ఉధృతంగా ప్రవహించాయి. నిత్యం అనిశెట్టిపల్లి వద్ద పుణ్యపువాగు, సిద్దారం వద్ద వాగు, రాయిపాడు వద్ద కిన్నెరసాని వాగు లోలెవల్ బ్రిడ్జిలు కావడంతో వర్షం వచ్చిందటే చాలు నీరు బ్రిడ్జిపై నుంచి వెళ్ళడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. సంపత్ నగర్ వాగు ఉధృతకి రోడ్డు కొట్టుకుపోయింది.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

అశ్వాపురం, సెప్టెంబర్ 2: శనివారం రాత్రి కురిసిన వర్షానికి మొండికుంటలో తోగువాగు ఉప్పొంగి అందులో కొట్టుకుపోయి మృతిచెందిన వెంకటాపురం గ్రామానికి చెందిన కల్లూరి నీలమయ్య, తాటి ఆదెమ్మ కుటుంబాలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌తో కలిసి సోమవారం ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల చొప్పున రూ.10లక్షల చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, అధికారులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 2: శనివారం వరదలో కదలలేక ముంపునకు గురై మృతి చెందిన దివ్యాంగుడు నందికొళ్ల రాము (29)కు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం సాయంత్రం బాధితురాలు రత్నంకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చింతలచెరువును పరిశీలించిన తహసీల్దార్

సారపాక, సెప్టెంబర్ 2: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని సంజీవరెడ్డిపాలెం సమీపంలోని చింతలచెరువు పూర్తిస్థాయిలో నిండడంతో రైతుల విజ్ఞప్తి మేరకు తహసీల్దార్ ముజాహిద్ సోమవారం చెరువును సందర్శించారు. మాజీ ఎంపీపీ రోశిరెడ్డిని చెరువు సామర్థ్యం, ఈ చెరువు ఆయకట్టు కింద ఎంతమంది పంటలు సాగుచేస్తున్నారని తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ ముత్తయ్య రైతులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన ఏవో

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటమునిగిన పొలాలను మండల వ్యవసాయాధికారి శంకర్ సోమవారం ఏఈవోలతో కలిసి పరిశీలించారు. బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, కొమ్ము నకిరిపేట, పోలవరం, కృష్ణసాగర్ గ్రామాల్లో వరి, పత్తి పంటలను పరిశీలించారు. వరద తాకిడికి పత్తి, వరి పూర్తిగా కొట్టుకుపోవడంతో పంట నష్టం అంచనా వేశారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రసాద్, శృతి, వైష్ణవి, రైతులు పాల్గొన్నారు.

గోదావరిలోకి కొట్టుకుపోయిన వలలు

పర్ణశాల, సెప్టెంబర్ 2: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పెరగడంతో సున్నంబట్టి గ్రామం వద్ద గోదావరి నదిలో చేపల వేట కోసం వేసిన వలలు కొట్టుకుపోయాయని సున్నంబట్టి గ్రామ గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిను 20 కుటుంబాలు చేపల వేటపైనే జీవనం సాగిస్తున్నాయి. ఒక్కొక్క వల రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని, గంగపుత్రులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సారపాక, సెప్టెంబర్ 2: రెండు రోజులుగా కురిసిన వర్షానికి పత్తి పంట నష్టపోయిన సారపాక పంచాయతీ శ్రీరాంపురం ఎస్టీ కాలనీ రైతులను ఆదుకోవాలని పత్తి రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టీ కాలనీకి చెందిన 14 మంది రైతులు 23 ఎకరాల్లో పత్తి పంట వేశారు. వరద కారణంగా ఇసుక మేటలు వేసి తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు తమను ఆదుకుని పరిహారం అందించేలా చూడాలని వేడుకుంటున్నారు.

కృష్ణసాగర్ పంచాయతీ బత్తులనగర్‌లో..

మండలంలోని కృష్ణసాగర్ పంచాయతీ బత్తులనగర్‌లో 50 ఎకరాల్లో వరి, పత్తి పంటను వేసి రైతులు నష్టపోయారు. సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు సోమవారం పొలాల వద్దకు వెళ్లి పంటలను చూసి నష్టపోయిన రైతులను పరామర్శించారు. ప్రభుత్వం బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కరకగూడెం,సెప్టెంబర్ 2: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కరకగూడెం ప్రాంతంలోని లొతట్టు ప్రాంతాలతో పాటు కరకగూడెం- చిరుమళ్ల గ్రామాల మధ్యలోని పెద్దవాగుపై ఉన్న వంతెనను పరిశీలించారు. ప్రజలు ఎటువంటి అందోళన చెందవద్దని ఇరిగేషన్ అధికారులు మరమ్మతు చర్యలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత గ్రామాలకు తెప్పలు సరఫరా

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 2: వరదల నేపథ్యంలో దుమ్ముగూడెంలో గ్రామాల్లో వరద బాధితులను కాపాడేందుకు మత్స్యకారులు ఉపయోగించే తెప్పలను తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం వచ్చాయి. మండలానికి 9 తెప్పలను కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశాల మేరకు వచ్చాయని తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. వరద ప్రభావిత గ్రామాల్లో వరద బాధితుల కోసం వీటిని సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు లక్ష్మయ్య, వెంకట్, రెవెన్యూ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

చర్ల, సెప్టెంబర్ 2: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమవారం ఉదయం చర్ల నుంచి భద్రాచలం వెళ్ళే ప్రధాన రహదారిపై ఆర్ కొత్తగూడెం వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తివేత

చర్ల, సెప్టెంబర్ 2: తాలిపేరు ప్రాజెక్టు 25గేట్లు ఎత్తి 17,697 క్యూసెక్కుల నీటిని సోమవారం దిగువకు వదిలారు.18గేట్లు పూర్తిగా 7 గేట్లు రెండు అడుగుల మేర ఎత్తినట్టు ఏఈఈ ఉపేందర్ తెలిపారు.ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం 74 మీటర్లుండగా సోమవారం 70.09మీటర్లు ఉందని ఆయన తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో రేగా పర్యటన

మణుగూరు టౌన్, ఆగస్టు 2: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాలు , ఇళ్లు ముంపునకు గురయ్యాయి. సోమవారం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పట్టణంలోని ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. సుందరయ్య నగర్, కుంకుడుచెట్ల గుంపు, వినాయకనగర్, మామిడిచెట్ల గుంపు, అశోక్‌నగర్, బాలాజీ నగర్, ఆదర్శనగర్, సురక్షాబస్టాండ్ ముంపునకు గురయ్యాయి. పట్టణం నడిబొడ్డు నుంచి ప్రవహించే కట్టువాగు, మొట్టు వాగు తీవ్ర ఉధృతంగా ప్రవహించడంతో సుందరయ్యనగర్‌లోని అన్ని వీధుల్లో ఇండ్లల్లో వరద నీరు చేరాయి. పలురోడ్లు కొట్టుకుపోగా, ఇంట్లోని బియ్యం, నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు నీటమునగ్గా వాటిని బీఆర్ఎస్ నాయకులతో కలిసి రేగా పరిశీలించి వివరాలు సేకరించారు. రాష్ట్ర నాయకులతో మాట్లాడి సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మేదరబస్తీవాసుల ఆందోళన

వరద ముంపునకు గురైనా పట్టించుకోవడం లేదని ఆరోపణ

రోడ్డుపై ఆందోళన చేస్తున్న మేదరబస్తీవాసులు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 2 : భారీ వర్షంతో తమ కాలనీ ముంపునకు గురైతే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ఆరోపిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని మేదర బస్తీవాసులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కనీసం మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సుమారు అరగంటకు పైగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలతో తమ ఇళ్లలోకి నీళ్లు చేరి ఇబ్బంది పడుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారన్నారు. ఎమ్మెల్యే, తహసీల్దార్ మా కాలనీని సందర్శించిన పాపాన పోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల సమయంలో వచ్చి పలకరించిన ఎమ్మెల్యే బాధల్లో ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నించారు. కాగా.. ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై మేడ ప్రసాద్ అక్కడికి చేరుకుని కాలనీవాసులకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

గోదావరి ముంపు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఎగువ నుం చి వచ్చే వరదతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని, ఇందుకోసం అధికారులు, ప్రజలు 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, పినపాక మండలాల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, గ్రామాల ప్రజలు గోదావరి ఉధృతిని నిరంతరం గమనించాలని సూచించారు. అధికారులు కూడా వెంటనే స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని ఆదేశించారు. అవసరమైన రెస్క్యూ బృందాలు, మరబోట్లను సమకూర్చుకోవాలన్నారు. అత్యవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించే విధంగా వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లోనూ అవసరమైన నిత్యావసరాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

బూర్గంపహాడ్, సెప్టెంబర్ 2: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్

గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 1: అధిక వర్షాలు పడుతున్న దృష్ట్యా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల హెచ్‌ఎంలు, వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని భద్రాచలం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులు పెట్టిన అర్జీలను తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించి వీలైనంత త్వరగా మిగిలిన సమస్యలను సంబంధిత యూనిట్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులం ఆర్‌సీవో నాగార్జునరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, కొండరెడ్ల అధికారి నరేష్, ఏపీవో పవర్ మునీర్‌పాషా, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, ప్రమీలబాయ్, మిషన్ భగీరథ ఏఈ నారాయణరావు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, హెచ్ఈవో లింగానాయక్, ఎస్‌డీసీ ముదిరాజు, జేడీఎం హరికృష్ణ, భద్రమ్మ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం

డ్రైనేజీ పనులు ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 2: భద్రాచలం ఐటీడీఏ రోడ్‌లో డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. ఈవో శ్రీనివాసరావు, నాయకులు రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, బోగాల శ్రీనివాసరెడ్డి, అరికెల తిరుపతి రావు, నర్రా రాము, వెంకట రెడ్డి, రాము పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డి పల్లి, ఆగస్టు 2: మండలంలోని జ్యోతిబాపూలే గురుకుల కళాశాల, గిరిజన బాలికల గురుకులం విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు ఇచ్చారు.

రామవరం, సెప్టెంబర్ 2: రామవరం ఎనిమిదో వార్డులో సోమవారం 14వ నంబర్ బస్తీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ రాము వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ కంచర్ల జమలయ్య, సెంటర్ వైద్య సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సైంటిస్ట్ ఆత్మ శాంతికి కొవ్వొత్తులతో ప్రదర్శన


కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న నాయకులు

టేకులపల్లి, సెప్టెంబర్ 2: యంగ్ సైంటిస్ట్ అవార్డు గెలుచుకున్న వ్యవసాయ శాఖ సైంటిస్ట్ నునావత్ అశ్విని, తన తండ్రితోపాటు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ టేకులపల్లిలో నాయకులు సోమవారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. బోడ బాలునాయక్, భూక్యా లాల్‌నాయక్, బాలకృష్ణ, సాయి, సురేష్, అనిల్, నోముల భానుచందర్, బన్సీలాల్, మంగీలాల్, హుస్సేన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింగరేణి ఖాళీ క్వార్టర్లు కూల్చివేత

రామవరం, సెప్టెంబర్ 2: రుద్రంపూర్ పంచాయతీ ఎస్ఆర్‌టీ ఏరియాలోని సింగరేణి ఖాళీ క్వార్టర్లను అధికారులు సోమవారం జేసీబీతో కూల్చివేయించారు. ఈ కూల్చివేతలకు మిగతా క్వార్టర్లలో ఉంటున్న వారు, సీపీఐ నాయకులు అభ్యంతరం తెలిపారు. ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు చూసుకునేందుకు కనీసం 15 రోజులపాటు గడువు ఇవ్వాలన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తికి సింగరేణి ఉన్నతాధికారులు అంగీకరించిన విషయాన్ని ఈ అధికారుల దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. అంతేకాదు, ఎమ్మెల్యే కూనంనేనితో ఫోన్‌లో మాట్లాడించారు. ఖాళీ క్వార్టర్లను మాత్రమే తాము కూల్చివేస్తున్నామని ఆ అధికారులు ఎమ్మెల్యేతో చెప్పారు.

సింగరేణి పర్సనల్ జీఎంగా కవితానాయుడు

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 2: సింగరేణి పర్సనల్ జీఎం(ఈఈ అండ్ సీఎస్ఆర్)గా ఉన్న కవితానాయుడుకు పర్సనల్ జీఎం (ఐఆర్ అండ్ పీఎం)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పర్సనల్ ఏజీఎం కె.శ్రీనివాసరావును పర్సనల్ జీఎంగా ఉద్యోగోన్నతి ఇచ్చింది.

బీమా చెక్కు అందజేత

చుంచుపల్లి, సెప్టెంబర్ 2: కొత్తగూడెం సొసైటీ నుంచి రుణం తీసుకున్న లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక గ్రామ రైతు పాయం చిన్న వెంకయ్య అనే రైతు ఇటీవల మృతిచెందాడు. ఆయన భార్య బాయమ్మకు రూ.50వేల బీమా చెక్కును చైర్మన్ మండె వీరహన్మంతరావు సోమవారం ఇచ్చారు. సొసైటీ డైరెక్టర్ కంటెం సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన పామాయిల్ గెలల ధర

అశ్వారావుపేట, సెప్టెంబర్ 2: పామాయిల్ గెలల ధర ఆగస్టు నెలకు స్వల్పంగా పెరిగింది. టన్ను గెలల ధర జూలై నెలలో రూ.13,828 ఉండగా, ఆగస్టు నెలకు రూ.564 పెరిగి రూ.14,392కు చేరింది. ఈ విషయాన్ని టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు సోమవారం ప్రకటించారు. ఆగస్టు నెలలో ఫ్యాక్టరీకి తరలించిన గెలలకు మాత్రమే పెరిగిన ధర వర్తిస్తుందని స్పష్టం చేశారు. లేత తోటల్లోని గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి మాత్రమే తరలించాలని రైతులను ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

చంద్రుగొండ, సెప్టెంబర్ 2: చంద్రుగొండలోని వరద బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం పరామర్శించారు. డబుల్ ఇండ్ల కాలనీకి డ్రైనేజీ, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు మంజూరు చేయాలని ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 2: ఏపీలోని యటపాక మండలం గుండాల గ్రామంలో ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అక్రమంగా ఇసుకను లారీలో తరలిస్తుండగా భద్రాచలం ఎస్సై విజయలక్ష్మి సోమవారం పట్టుకున్నారు. ఇసుకను పురుషోత్తపట్నం మీదుగా భద్రాచలంలోకి వచ్చిన లారీని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అగంతకులు తరమడంతో కానిస్టేబుల్‌కు ప్రమాదం

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 2: అగంతకులు తరుముతుండడంతో తప్పించుకోబోయిన కానిస్టేబుల్‌కు ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగూడెం ప్రగతి నగర్‌కు చెందిన కొమురం ప్రశాంత్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బైక్‌పై వెళ్తున్న అతడిని కొందరు అగంతకులు తరుముకుంటూ వచ్చారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో సిగ్నల్స్ పోల్‌ను ప్రశాంత్ బైక్ ఢీకొంది. అతడు తీవ్ర గాయాలతో కొద్దిసేపటి తర్వాత అపస్మారక స్థితికి చేరాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న ఆ అగంతకులు.. తమ వాళ్లను ఢీకొట్టి, ఆగకుండా వెళ్లావు కాబట్టి వెంబడించామని కానిస్టేబుల్‌తో చెప్పి వెళ్లిపోయారు. టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ టి.రమేష్, వన్ టౌన్ ఎస్సై విజయ.. స్థానికుల సాయంతో ప్రశాంత్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) పరితోష్ పంకజ్ పరామర్శించారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 2: జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో పరీక్షలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శెట్టి వినోద, మర్మం చంద్రయ్య, తేజావత్ వెంకన్న, కోట బాలకృష్ణ, రాములు, రఘు, సంధ్యారాణి, నాగదుర్గ, రుహీనా, రామకోటమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కరకగూడెం, సెప్టెంబర్ 2: మండలంలోని పద్మాపురం, చింతలగుంపు గ్రామాల్లో సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ మధు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే స్థానిక పీహెచ్‌సీలో సంప్రదించాలని అన్నారు.

గంజాయి క్రయ విక్రేతల అరెస్ట్

పాల్వంచ, సెప్టెంబర్ 2: పట్టణంలోని జీసీసీ గోడౌన్స్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ అబ్దుల్ మసూదర్ రెహమాన్‌ను, కొనుగోలు చేస్తున్న యాకూబ్ పాషాను, నక్క అజయ్‌ను పాల్వంచ పట్టణ పోలీసులు సోమవారం రాత్రి పక్కా సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఇందిరా కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ మసూదర్ రెహమాన్.. 3.4 కేజీల గంజాయిని ఒడిశా నుంచి తీసుకొచ్చి, జీసీసీ గోడౌన్ ప్రాంతంలో విక్రయిస్తున్నాడు. దీనిని వెంగళరావు కాలనీకి చెందిన యాకూబ్‌పాషా, నక్క అజయ్ కొనుగోలు చేస్తున్నారు. ఈ ముగ్గురిని ఎస్సై సుమన్ పట్టుకున్నారు. వారి నుంచి 3.4 కేజీల గంజాయితోపాటు రూ.5వేలను, రెండు బైక్‌లను, మూడు సెల్ ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేశారు.

నోటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 2: కొత్తగూడెం నోటరీ విభాగం, నోటరీ న్యాయవాదుల నియామకానికి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ కోరారు. ఆయన సోమవారం అసోసియేషన్ సమావేశంలో మాట్లాడారు.